# వైతరణి

"భారతి! ఈ రోజు మన లాయరుగార్ని రమ్మని పిలిచాను. ఆయనకి కూడా వంటచేయి" దొడ్లోకి పోబుతూ వంటగదిలోని భార్యకి వినిపించేటంత గట్టిగా అన్నారు పార్వతీశంగారు.

"లాయరుగార్నా! ఎందుకూ!" ఆశ్చర్యంగా అడిగింది భారతి వెంటనే.

"నీకే తెలుస్తుంది... తొందరపడతావేం!" ఆమె సమాధానానికి ఎదురు చూడకుండానే దొడ్లోకి వెళ్ళిపోయారు పార్వతిశంగారు.

'అబ్బ! ఈయన ఎపుడూ ఇంతే! ఏదీ ముందు చెప్పరు కదా... అయినా ఇపుడు లాయరుగారితో ఏం అవసరం వచ్చింది' ఎందుకో ఆమె మనసు కీడు శంకించింది. అన్యమనస్కంగా వంట పూర్తి చేసింది.

స్నానం ముగించి పూజా కార్యక్రమాలన్నీ వేసుకుని, లాయరుగారి రాకకై ఎదురు చూస్తూ సోఫాలో కూర్చుని పేపరు తిరగవేయసాగారు.

నెమ్మదిగా భర్త దగ్గర చేరింది భారతి.

అయినా ఆమెని గమనించకుండా పేపరు చూడటంలో నిమగ్నమయిపోయారు పార్వతీశంగారు.

"ఏమండీ!" నెమ్మదిగా పిలిచిందామె.

"ఏం భారతీ! వంట అయిపోయిందా! ఇంకో అరగంటలో రావచ్చు" పేపరులోంచి తల బయటకు తియ్యకుండానే అన్నారాయన.

"అహ! అదీ కాదండీ! ఇపుడు లాయరుగారితో పని ఏమిటని..."

"అబ్బ! తినబోతూ రుచి ఎందుకు చెప్పు!" నవ్వారాయన.

"హైగా ఆయన మనింటికి వచ్చి చాలా రోజులయ్యింది. ప్రతి రోజూ మనిద్దరం తిని తినీ విసుగుపుడుతోంది... అందుకే సరదాగా అందరం కలిసి భోంచేస్తే బాగుంటుందనీ"

ఆయన చెప్పే కారణం నిజం కాదని ఆమెకి అర్థం అయిపోయింది. నెమ్మదిగా ఆయన కాళ్ళ దగ్గర చతికిలబడింది.

'అయ్యో! అదేమిటి భారతి! ఇలా కూర్చో!' నెమ్మదిగా ఆమె భుజం మీద చెయి వేశారు.

కానీ ఆమె లేవకపోగా, ఆయన తొడమీద తల పెట్టుకుంది. ఎందుకో ఆమెకి దుఃఖం ముంచుకొస్తోంది.

"ఏమయింది భారతి!" కంగారుగా అడిగారు పార్వతీశంగారు.

ఉన్నట్లుండి బావురుమంది భారతి.

కంగారు పడిపోయారు పార్వతీశంగారు.

ఒక్కసారి భార్యను దగ్గరకు తీసుకున్నారు.

"ఎందుకు? ఎందుకు భారతీ! అంత బాధ పడుతున్నావు!" ఆందోళనగా అడిగారాయన.

"మీరు... మీరు లాయరుగార్ని ఎందుకు పిలుస్తున్నారో నాకు తెలుసు!" వెక్కుతూ అందామె.

"ఎందుకు?..."

"అదే... మొన్న అన్నారుగా... విల్లు...విల్లు రాయిస్తానని..."

గొల్లున నవ్వారు పార్వతీశంగారు.

"ఓసి పిచ్చి మొహమా! అదా నీ భయం! విల్లు రాసినంతమాత్రాన చచ్చిపోతామా! పిచ్చి ఆలోచనలు మానేసెయ్యి... నేను అన్నట్లుగానే ఆస్తి మొత్తం నీకే రాయిస్తాను... నువ్వు వద్దన్నాసరే!... అయినా ఇపుడు మాత్రం అందుకు కాదు పిలిచేది... భయపడకు..."

కొద్దిసేపు మౌనంగా ఉండిపోయిందామె.

భార్య భయానికి నవ్వుకున్నా... ఎందుకో తను ఎక్కువ రోజులు బ్రతకనేమో అన్న అనుమానం అనుక్షణం ఆయన్ను వెంటాడుతూనే ఉంది. అందుకే భారతికి అన్యాయం జరగకుండా ఆమె బ్రతికినన్నాళ్ళూ దర్జాగా కొడుకుల మీద ఆధారపడకుండా ఉండాలనే తన తపన... పిచ్చి భారతి... కొడుకులంటే వెర్రి ప్రేమ. ఆ మాటకొస్తే తనకు మాత్రం లేదూ... అయినా, అద్దాలవాడు బిడ్డలు గానీ గడ్డాలొచ్చాక బిడ్డలా? అన్న సామెత తమపట్ల జరుగుతుందని కాదుగానీ... తన జాగ్రత్తలో తనుండటం మంచిది కదా! తన ముగ్గురు కొడుకులూ ముత్యాలే! కోడళ్ళు కూడా తగ్గవారే దొరికారు... వారు కోరిన చదువు చెప్పించి వారి కాళ్ళమీద నిలబడేటట్లు చేసి తన బాధ్యత నెరవేర్చుకున్నారు. రెక్కలొచ్చిన పక్షుల్లా తలొక చోటా ఉద్యోగాలు చేసుకుంటూ హాయిగా బ్రతుకుతున్నారు... ఇపుడు ఉన్న స్థిరాస్తి తన కష్టార్జితం. తమ తదనంతరం వారిదే. అందుకే ఎటుపోయి ఎటొస్తుందో... ఏ నిముషంలో ఏం జరుగుతుందోనని 'విల్లు' రాయిస్తానని తను అన్న మాటకి ఎంత దెబ్బలాడింది భారతి. విల్లు పేరే ఎత్తద్దంది. తన ముగ్గురు బిడ్డలూ మూడు రవ్వలంది పిచ్చిది.

.. తనలో తనే నవ్వుకున్నారు పార్వతీశంగారు. తనని ఏడిపించి ఆయన నవ్వుకుంటున్నారు... ఉక్రోషం ముంచుకొచ్చింది భారతికి.

ఏదో అనబోయింది.

ఇంతలో తలుపు చప్పుడయింది.

నెమ్మదిగా లేచి తలుపు తీసింది.

ఎదురుగా లాయరు కృష్ణమూర్తిగారు. చిన్నప్పటి నుంచీ ప్రాణస్నేహితులిద్దరూ.

"రారా! నీకోసమే ఎదురు చూస్తున్నాను. ఆకలి దంచేస్తోంది" నవ్వుతూ ఆహ్వానించారు పార్వతీశంగారు.

"కొంచెం ఆలస్యం అయిందిరా! చెల్లమ్మా! ఏమీ అనుకోవుగదా!"

"బలేవారే అన్నయ్యా! రండి! కాళ్ళు కడుక్కోండి" చెంబుతో నీళ్ళిచ్చింది భారతి.

పీటలువేసి విస్తళ్ళల్లో ఇద్దరికీ వడ్డించింది.

కొసరి కొసరి తినిపించారు పార్వతీశంగారు మిత్రుడికి.

"అవునూ! చెల్లెమ్మా! నువ్వు తినవేం!"

"అలిగిందిరా! నామీద..." నవ్వారు పార్వతీశంగారు.

"ఛీ... ఊరుకోండి! అదేంలేదు అన్నయ్యా! ...మీరు లేవండి... నేను కొంచెం సేపు ఆగాక తింటాను...ఒక్కపొడి అందించింది ఇద్దరికీ.

హాల్లోకెళ్ళి సోఫాల్లో కూర్చున్నారిద్దరూ.

నెమ్మదిగా లోకాభిరామాయణంలోంచి అసలు కథలోకి వచ్చారు.

"వీలునామా ఇపుడు రాయాల్సిన అవసరం ఏమిట్రా?"

"నీకు తెలియదు కృష్ణా! ఏ నిముషం ఏం

జరుగుతుందో.. అది అసలే వెర్రిబాగుల్ది... దాన్ని ఎవరన్నా ఏదన్నా అంటే నేను సహించలేను... అందుకే నాకున్న ఈ స్థిరాస్తి అంతా దాని పేర రాసి... తదనంతరం..."

ఆయన మాట పూర్తి కాకుండానే దుమారంలా వచ్చిపడింది భారతి.

ఆమె ముఖం ఎర్రగా అయిపోయింది.

"అదే అన్నయ్యా! వారం రోజుల నుంచీ ఇదే వరస... తనకేదో అయిపోతుందట. నేను అనాథనవుతానట... అందుకని తన ఆస్తి అంతా నాకు రాస్తారట. ముగ్గురు బిడ్డలున్న నేను అనాథనెలా అవుతాను చెప్పండి. అయినా తనకేదో అవుతుందని అంటారే గానీ... నా అదృష్టం బాగుండి నేనే ఆయన చేతుల్లో పోతాను... అంతే... ఎపుడూ అశుభం పలకటమే. ఏది ఏమైనా ఆస్తి పిల్లల పేర రాయండి, అంతే!" విసురుగా వెళ్ళిపోయింది భారతి.

# తాడేపల్లి భాగ్యలక్ష్మి మాధవ్




స్నేహితులిద్దరూ ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

"ఇదే వరస... చూస్తున్నావుగా...ఎలా మండి పడుతోందో."

ఆమె చెప్పింది నిజమే కదరా... నీ పిల్లలు నిజంగా రత్నాలు... ఆస్తి వారికి పంచినంత మాత్రాన మిమ్మల్ని చూడరని మీరు అనుకోనవసరం లేదు. ఇక వీలునామా రాయటం అంటావా అది ఇపుడు రాయటం మంచిదే... ఏ నిముషమూ మనది కాదు" కృష్ణమూర్తిగారి మాటలకు క్షణం మౌనంగా ఉండిపోయారు పార్వతీశంగారు.

చివరకు నెమ్మదిగా అన్నారు.

"సరే అది చెప్పినట్లే చేయి. పిల్లలు ముగ్గురికీ సమాన వాటాలు రాయి."

"అలాగే..."

★ ★ ★ ★

హఠాత్తుగా తండ్రి పోయారని తెలిగ్రాం

రాగానే ఆఘ మేఘాలమీద వచ్చారు ముగ్గురు కొడుకులూ, భార్యలతో సహా.

అనుకోని ఈ సంఘటన భారతిని నిర్జీవిలా తయారు చేసింది.

పన్నెండు రోజులూ ఘనంగా కర్మకాండలు చేశారు కొడుకులు. అటువంటి కొడుకులను కన్నందుకు పార్వతీశంగారు ఎంతో అదృష్టవంతులని అందరు పొగిడారు.

లాయరు కృష్ణమూర్తిగారు పార్వతీశంగారు రాయించిన ఆస్తి వీలునామా డాక్యుమెంట్స్ ముగ్గురికీ అప్పచెప్పారు. తద్వారా జరిగిన భార్యాభర్తల వివాదం గురించి కూడా వివరంగా చెప్పి తల్లిని జాగ్రత్తగా చూసుకోమని హెచ్చరించారు.

"అంతకంటే మాకు కావలసిందేముంది... మాకుకావలసింది ఈ ఆస్తికాదు...మా అమ్మ ... " ముగ్గురూ ఒకేమాట అన్నారు.

"అందరిదగ్గరా అమ్మ ఉండాలి... ఎలా... ఓ పనిచేద్దాం. ముగ్గురి దగ్గరా నాలుగు నెలల చొప్పున వుంటుంది. అపుడు అమ్మ అందరి దగ్గరా ఉన్నట్లేగా..."

"నిజమే స్థలం మార్పు ఆ తల్లికీ కావాలి. ఒకే చోట మనసు నిలకడగా ఉండదు..." కృష్ణమూర్తిగారు కూడా అలాగే బాగుందన్నారు.

ముందుగా పెద్దకొడుకు రఘు తీసుకెళ్తానన్నాడు. ఇల్లు అద్దెకిచ్చి రఘు వెంట వెళ్ళిపోయింది భారతి.

★ ★ ★ ★

సంవత్సరం గడిచింది. అన్నట్లుగానే ప్రతి కొడుకు దగ్గరా నాలుగు నెలలు గడిపి తిరిగి పెద్ద కొడుకు దగ్గరకు వచ్చింది భారతి. అసలే నెలతప్పి నలతగా ఉన్న పెద్దకోడలు అత్తగారు రావటంతో పూర్తిగా మంచం ఎక్కింది వేవిళ్ళతో. కోడల్ని కాలు కింద పెట్టనీయకుండా అపురూపంగా చూస్తుంది భారతి. కానీ వయసు మీదపడ్డ ఆమె ఆరోగ్యం అంతంతమాత్రంగానే ఉంది. రక్తపోటుతో పాటు షుగర్ కూడా పెరిగింది. ఉదయం, సాయంత్రం మందులతోనే రోగాన్ని అణగద్రొక్కాలి. రాత్రిళ్ళు నిద్రపట్టదు. ప్రతి రోజూ బి.పి. మాత్రతోపాటు నిద్ర మాత్ర కూడా ఒకటి వేసుకోవాలి.

ఏమాటకామాటే... పాపం... తల్లి మందులు మాత్రం నెలకి సరిపడా ఒక్కసారే తెచ్చి పడేస్తారు ముగ్గురు కొడుకులూ. రోజూ దగ్గరుండి మాత్రలు ఇస్తారు. కొడుకులకి తన మీద వున్న ప్రేమకి మురిసిపోతుంది భారతి.

★ ★ ★ ★

ఉదయమే లేచే తల్లి ఆరోజు ఎంతకీ లేవకపోవటంతో ఆమె గదిలోకి వచ్చిన రఘు తల్లి మంచం దగ్గరకొచ్చాడు. నిద్రపోతున్న తల్లిని తట్టి లేపాడు. కానీ లేవలేదు. ఒళ్ళు చల్లగా తగిలేసరికి... ఉలిక్కిపడ్డాడు. అనుమానంగా మరొక్కసారి చూశాడు. అతని అనుమానం నిజమే. భారతి చచ్చిపోయింది.

భార్యని పిలిచాడు కంగారుగా.

ఇద్దరూ కలిసి ఆమెను మంచం మీద నుంచీ హాల్లోకి తెచ్చి చాపవేసి పడుకోపెట్టారు. క్షణాల మీద ఈ వార్త దావానలంలా పాకిపోయింది. ఇల్లంతా ఇరుగు పొరుగు వారితో నిండిపోయింది.

రాత్రి పిక్షేపంగా అందరితో కలిసి భోజనం చేసి, కబుర్లు చెప్పిన ఆమె తెల్లారేసరికి శవంగా మారింది. ఏమిటో ఈ జీవితాలు...

ఆమెకేమమ్మా! బంగారంలాంటి చావు. అది అందరికీ వస్తుందా! ముత్యాల్లాంటి ముగ్గురుబిడ్డలూ... కోడళ్ళు కాలు క్రింద పెట్టనియ్యరు. అదృష్టవంతురాలు... ఒక్క రోజు కూడా తీసుకోలేదు... ఎప్పటికైనా చావవలసిన వాళ్ళమే కదా...

ఇరుగు పొరుగు మాటలతో ఇల్లు మారుమ్రోగుతోంది.

తమ్ముళ్ళకి ఫోన్లు చేశాడు. వాళ్ళు వెంటనే బయలుదేరి వచ్చారు.

తల్లి క్షేమ సమాచారాలు ఎప్పటికపుడు తెలుసుకుంటూనే ఉంటారు ఆ అన్నదమ్ములు. ఇంత హఠాత్ మరణం తల్లికి రావటం వారికి చాలా ఆశ్చర్యంగా ఉంది.

ఆఖరి కొడుకు రాజా, రెండో కొడుకు రామం అదే అడిగారు.

"అవును రాజా! అమ్మ నీ దగ్గర నుంచి వచ్చి ఎన్ని రోజులైంది?..."

"సరిగ్గా ఈ రోజుకి నాలుగు నెలలు....రేపే రామం దగ్గరకు వెళ్ళాల్సింది... ఇంతలో..." దుఃఖంతో రఘు గొంతు పూడుకుపోయింది.

కోడళ్ళిద్దరూ అత్తగారివంక చూశారు. వారి భృకిటి ముడిపడింది.

ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

క్షణాల మీద ఏర్పాట్లు పూర్తయ్యాయి. పూరరథంలా అలంకరించిన పాడె మీద ముగ్గురు కొడుకుల చేతుల మీదుగా ఆమె జీవితం హాయిగా తెల్లారిపోయింది.


అందరూ ఆమె అదృష్టాన్ని పొగిడేవారే... కానీ... ఎందుకో పెద్దకొడుకు రఘుకి మాత్రం తెలియని బాధ గుండెను పిండేస్తోంది.

"ఒంటెడు నగల్తో... ఎప్పుడూ లక్ష్మీదేవిలా ఉండేదమ్మా! భగవంతుడు ఆ ఒక్కలోటూ పెట్టాడు..." ఎవరో ముత్తయిదువ అంది... మరి ఒంటిమీద ఒక్క నగ కూడా లేదే! ఎవరిదో సందేహం...

"అసలే... రోజులు బాగాలేవు కదా! ప్రతి రోజూ ఆమె నగలు తీసే పడుకునేవారు" పెద్దకోడలు సమాధానం చెప్పింది.

మిగతా ఇద్దరి కోడళ్ళ ముఖం ప్రసన్నంగా మారిపోయింది. ఎక్కడలేని దుఃఖం ముంచుకొచ్చి ఆమె వారి దగ్గర గడిపినపుడు జరిగిన సంఘటనలు చెప్పుకున్నారు. ఒక్క విషయం తప్ప...

అందరూ ఆమె చుట్టూ కూర్చుండగా రఘు మాత్రం తల్లి గదిలోకి వెళ్ళి చుట్టూ పరికించాడు. ఆమె పరుపు ఎత్తి చూశాడు. అతను కోరినదేదో దొరికింది. వెంటనే తీసి దాచేశాడు. తిరిగి మామూలుగా అందరిలో కలిసిపోయాడు.



భారతి వల్లగా కొడుకుల చేతుల్లో, భర్త కోరి నట్లుగా వెళ్ళిపోయింది.

అంతకంటే ఏ స్త్రీ మాత్రం కోరుకునేదే ముంది!

★ ★ ★ ★

"చిరంజీవి రఘుకి అమ్మ దీవించి వ్రాయున ది. నాకు ఉత్తరం రాయటం కూడా సరిగా రాదు. ఆ అవసరం మీ నాన్నగారు నాకు కల్పించలేదు. అనుక్షణం ఆయన నా కళ్ళముందే ఉండేవారు. ఇంక ఉత్తరాల్తో నాకు పనేముంది? కానీ ఇపుడు కన్నతల్లిని అర్థం చేసుకోలేని నా బిడ్డలకు తప్పని సరిగా ఉత్తరం వ్రాయవలసి వచ్చింది. అదీ చివరి ఉత్తరం.

ఆస్తులతోపాటు నన్నుకూడా పంచుకున్న మీకు తప్పకుండా నా బాధ తెలియాలి. అందుకే ఈ ఉత్తరం.

ఆస్తులు లేకపోయినా మీరు హాయిగా బ్రతికేం దుకు అవసరమయే చదువు చెప్పించి మీ రెక్కలు మీకిచ్చారు. పెళ్ళిళ్ళు చేశారు.

ఆస్తి గురించి నాతో గొడవపడి, ఆస్తంతా నా పేరే రాస్తానన్న ఆయనతో దెబ్బలాడి మీ ముగ్గురి పేరా రాయించాను.

'పిచ్చిమొహమా! నేను కాకపోతే నువ్వు చాలా బాధపడతావు. ఆస్తిని చూసైనా నీ కొడుకులూ, కోడళ్ళూ చూస్తారు' అని హెచ్చరించారు. అంద రి కొడుకుల్లాంటివాళ్ళు కాదు నా బిడ్డలని ఆయ నతో పోట్లాడాను. ఇక నామాట కాదనలేక మీ పేరే వీలునామా రాశారు.

నా దురదృష్టం వలన ఆయన గుండెపోటుతో మరణించారు.

ఆస్తితోపాటు నన్నూ మీరు పంచుకున్నారు. నా మీద ప్రేమతో మీరూ చేసారని అనుకున్నాను



# షారూక్ అంటే ఇష్టమట

ఐస్ క్రీం ప్రియుల్ని ఏ ఐస్ క్రీం అంటే ఇష్టం అని అడిగితే ఏం చెపుతారు?

బాపూ చెప్పాలి మీకు ఏ హీరో అంటే ఎక్కువ ఇష్టం అని అడిగితే నాకు అందరు హీరోలు ఇష్టమే అని జవాబు చెపుతోంది. అందరి కంటే ఎక్కువ షరుక్ ఖాన్ అంటే ఇష్టం అని చెపుతుంది.

అంత ఎక్కువ ఇష్టం ఎందుకో మరి?

గానీ... జీతం లేని పనిమనిషి సంవత్సరానికి నాలు గు నెలలు మీకు దొరుకుతుందని ఊహించలేక పోయాను. నా అదృష్టమేమిటంటే నా ఆరోగ్యం గురించి మీరు తీసుకునే శ్రద్ధ మాత్రమే ప్రతి రోజూ వరస తప్పకుండా నా మాత్రలు నా చేతిలో పెడతారే... అని మాత్రమే...

లేకపోతే నేను కూడా మంచం ఎక్కితే...

ఈ రోజుతో నీ వంతు పూర్తవుతుంది. రేపు ఉదయమే అటు సూర్యుడిటు పొడిచినా నేను మాత్రం వాల్తేరు బండీ ఎక్కాల్సిందే. ఈ నాలు గేళ్ళు నుంచీ అదే జరుగుతోంది. ఇక నావల్ల కాదు. ఈ సారి నా ప్రయాణం వేరే చోటుకి... తిరిగిరాని చోటుకి...

కన్నబిడ్డల గురించి కట్టుకున్న భర్తతో దెబ్బ లాడిన నేను మీ పరువు తీయలేను. అందుకే

లోకం దృష్టిలో నేను చాలా అదృష్టవంతురాలిని.

నా కంటికి శుక్లాలు వస్తే డాక్టర్ ఆపరేషన్ చేయించాలన్నారు. నువ్వు నీ చిన్న తమ్ముడి దగ్గర చేయించుకోమన్నావు.

నీ చిన్న తమ్ముడు నా ముద్దుల కొడుకు రాజా దగ్గర చేయించుకోమన్నాడు.

రాజా తన భార్య కడుపుతో ఉంది. నేను ఆపరేషన్ చేయించుకుంటే ఆమె నాకు కూర్చో పెట్టి చేయలేదు. ఎలాగూ అన్నయ్య దగ్గరకెడతా వు కదా... అక్కడ చేయించుకోమన్నాడు... అదీ నిజమే... ఎందుకంటే తల్లినికదా. మీరన్నమాట లు నా కడుపులోనే దాచుకున్నాను. కడుపు చించు కుంటే కాళ్ళమీద పడుతుంది. అందుకే నాలో నేనే బాధపడ్డాను. భగవంతుని తిట్టుకున్నాను. ఎందుకో తెలుసా... నాకు ముగ్గురు బిడ్డల్ని ఇచ్చి నందుకు... వారు పంచుకునేందుకు నాకున్నవి రెండు కళ్ళేగా... కనీసం ఇద్దరినే లేక నలుగుర్ని ఇచ్చి ఉంటే పంపకాలు సరిగా జరిగేవి. అందుకే ఆ విషయంలో మిమ్మల్ని బాధపెట్టలేను. గుడ్డి జీవితం గడపలేను.

అందరిచే అదృష్టవంతురాలిగా పొగడబడే నేను అలాగే వెళ్ళిపోదల్చుకున్నాను.

కోడళ్ళను కోడళ్ళుగా కాక కూతుర్లుగానే అందరి దృష్టిలో ఉంచదల్చుకున్నాను.

ఇన్నాళ్ళు... ఇన్నేళ్ళు భరించిన నేను చని పోతూ మీకు అపనింద తేలేక గుప్తంగానే పోతున్నాను.

నువ్వు నాలుగు నెలలకు సరిపడా నిద్రమాత్ర లు ఇచ్చావుగా... అందులో సగం మిగుల్చుకుని... ఆఖరిరోజు దీర్ఘనిద్ర... నీ దగ్గరే పొదల్చుకు న్నాను...ఎందుకంటే... పెద్ద కొడుకువి కదా ...అన్నింటికీ నువ్వే అర్హుడివి.

నా నగలన్నీ తీసి దిండుకింద ఉంచాను. కోడ ళ్ళకి సమంగా పంచు. నాకు చేసే కర్మకాండలకి మీరు పంచుకోవద్దు. ఎందుకంటే మీరు వంతు లువేసుకుని చేసే గోదాన, భూదాన, సువర్ణదాన, కన్యాదాన ఫలితాలు నాకు దక్కవు. ముఖ్యంగా నువ్వు చేసే గోదానంతో నేను "వైతరణీ" నది దాటాలిగా... అందుకే... అందుకే వంతులు వేసుకుని నా కర్మకాండ చేయద్దు.

అసలు నాకు ఆ తతంగమే వద్దు. ఎందుకం టే నేను చేసిన పుణ్యమే నన్ను నరకం నుంచీ తప్పిస్తుంది. ఉంటాను— శాశ్వతంగా మిమ్మల్ని విడిపోయే మీ అమ్మ—

